క్లుప్తంగా

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



జలమండలి డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి కాలనీల్లోని ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సాహెబ్‌నగర్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ బలరాం, డీజీఎం సన్యాసిరావులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డాక్టర్స్ కాలనీ, బాపునగర్, చౌడీ, భగత్‌సింగ్‌నగర్, నర్సింహపురికాలనీ, అంబేడ్కర్‌నగర్, శ్రీనివాస కాలనీల్లో సీవరేజ్ పైపులైన్, మ్యాన్‌హోల్ ఛాంబర్ పునరుద్ధరణ పనులపై చర్చించి త్వరగా సమస్యల పరిష్కారం కోసం పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందేలా కృషి చేయాలని కోరామని తెలిపారు.

డీజీపీని కలిసిన ఏటీఓ



డీజీపీ శివధర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జయకృష్ణ

మహేశ్వరం: ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో అద్భుత విజయాన్ని సాధించి, అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా నియమితులైన మండల పరిధి తుమ్మలూరు గ్రామానికి చెందిన గడ్డమీది జయకృష్ణ.. సోమవారం డీజీపీ శివధర్‌రెడ్డి, ఐపీఎస్ మహేశ్ భగవత్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జయకృష్ణను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి.. ఏటీఓగా ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ప్రజల పట్ల నిబద్ధతో పనిచేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రాజమోని యాదగిరి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా



నరసింహను సన్మానిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన ప్రధానోపాధ్యాయులుగా నియమితులైన నరసింహ కొత్తపేట కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.

26 నుంచి అన్నప్రసాద వితరణ

మన్సూరాబాద్: ప్రసన్నప్రియ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 26 నుంచి అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ కమిటీ నేతలు తెలిపారు. ఈ నెల 26 నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు అయ్యప్ప స్వాములకు నిత్యఅన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

కుట్టు మిషన్ల అందజేత

చాదర్‌ఘాట్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. సోమవారం అజంపురాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే వారి కుటుంబాలకు చేయూతగా ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాగోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌కు చెందిన చకిలన్ గోపాల్(62), కూతురుని.. డెలివరీ కోసం డాక్టర్ కాలనీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆదివారం రాత్రి గోపాల్.. టిఫిన్ చేసి రోడ్డు అవతలి వైపు ఉన్న హాస్పిటల్‌కు వెళ్తుండగా.. ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.



బండమీది గూడూరు- కటికపల్లి రోడ్డు దుస్థితి



మాలగూడూరు- కటికపల్లి మార్గం..

రోడ్లు ‘ఛిద్రం’.. ప్రయాణం కష్టం

కురుస్తున్న వర్షాలతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. గోతులు ఏర్పడి, కంకర తేలి ఛిద్రమయ్యాయి. గుంతల్లో నీరు చేరి, వాహనదారులను ప్రమాదంలో పడేస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించాలంటే వెన్నులో వణుకుపుడుతోందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- అస్తవ్యస్తంగా అంతర్గత మార్గాలు
- ప్రమాదపుటంచులో ప్రయాణం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కందుకూరు: మండల పరిధి కటికపల్లి గ్రామానికి గూడూరు పరిధి బండ మీద గూడూరు నుంచి ఉన్న రెండు కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆ రహదారిపై నిర్మించిన లో- లెవల్ బ్రిడ్జి సైతం ప్రస్తుత వానలతో వరద ప్రవహిస్తూ.. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మాలగూడూరు నుంచి ఉన్న రోడ్డు పరిస్థితి ఇదే విధంగా ఉంది. దీంతో ఆ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధ్వాన రోడ్లకు కనీస మరమ్మతులు చేయించేవారు లేక.. ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు తెలిపారు.

అసంపూర్తి రోడ్డు.. అవస్థల్లో ప్రజలు



డైనమిక్ కాలనీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మీర్‌పేట: ఉన్న రోడ్డును అభివృద్ధి పనుల పేరిట తవ్వారు. అనంతరం కొంత దూరం మేర.. రహదారి నిర్మాణం చేపట్టి.. మధ్యలోనే వదిలేశారు. దీంతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదీ మీర్‌పేట కార్పొరేషన్ పరిధి డైనమిక్‌కాలనీ రోడ్డు దుస్థితి. అలా వదిలేసిన రోడ్డుపై ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచి.. తీవ్ర అసౌకర్యంగా మారింది. దీంతో ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని, అసలే సీజనల్ వ్యాధుల కాలం.. ఆపై రోడ్డుపై నిలిచిన నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

మట్టికొట్టుకుపోయి..



రావిర్యాల రోడ్డు దుస్థితి

తుక్కుగూడ: పుర పరిధి రావిర్యాల నుంచి ఔటర్ రింగు వైపు రోడ్డు ప్రమాదకరంగా మారింది. కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతికి రోడ్డుకు ఇరు వైపులా ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి ప్రమాదంలో పడుతున్నారు. అధికారులు స్పందించి, రోడ్డుకు ఇరువైపులా మరమ్మతు పనులు చేయించి, సమాంతరం చేయించాలని కోరుతున్నారు.

మొత్తం కచ్చరోడ్డే..



కటికపల్లి గ్రామానికి చేరుకునే రెండు వైపులా ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. పదేళ్ల క్రితం నిర్మించిన రహదారి అది. ఎన్నోగోతులు ఏర్పడ్డాయి. కంకర తేలి కచ్చరోడ్డును తలపిస్తోంది. అయినప్పటికీ.. ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. ఆ మార్గాల్లో పయనించాలంటే భయంగా ఉంది.

– నరేష్ ముదిరాజ్, కటికపల్లి

మరోమార్గం లేక..



అధ్వాన రోడ్డుతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేక పోతున్నాం. అటు బండమీదగూడూరు, ఇటు మాల గూడూరు రహదారులు నరకప్రాయంగా మారాయి. మరోమార్గం లేక.. ప్రమాదపుటంచులో పయనిస్తున్నాం. అధికారులు స్పందించి, రోడ్డు నిర్మించాలి.

– పురుషోత్తమ్, కటికపల్లి

తొక్కిసలాటలో ప్రాణాలు పోగొట్టుకోకండి

ప్రజలకు అవగాహన కార్యక్రమాలు

నాగోలు: సినిమాల విడుదల, రాజకీయ నాయకుల సభల సందర్భంగా జరుగుతున్న తొక్కిసలాటల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ ప్రజలకు అవగాహన కలిస్తున్నట్లు నాగోలు పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. తొక్కిసలాట సమయంలో ఎలా ప్రవర్తించాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు ప్రారంభించినట్లు వారు తెలిపారు. యువత, అభిమాన సంఘ సభ్యులు ఈ సూచనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. సినిమా కోసం, లేదా ఓ నాయకుడి సభ కోసం ప్రాణాలను పణంగా పెట్టడం సరికాదన్నారు. ఎవరికోసం ఆరాటపడుతూ అమూల్యమైన ప్రాణాలను కోల్పోవడం కన్నా జాగ్రత్తగా ఉండటం మేలని సూచించారు. పోలీసులు సామాజిక మాధ్యమాల ద్వారా, పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజల్లో జాగ్రత్తే ప్రాణరక్షణ అనే సందేశాన్ని ఇస్తున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

వనస్థలిపురం: ఎల్బీనగర్, హయత్‌నగర్ సర్కిళ్ల పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. రహదారులు, రోడ్ల పక్కనే గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోతోంది. చెత్తను రోడ్ల వెంబడి వేయడంలో వేస్తుండటంతో దుర్గంధంగా మారుతోంది. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలిలించాల్సి సిబ్బంది వాటిని తరలించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

12న పద్మశాలి సంఘం దసరా మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమర్తపు మురళి తదితరులు

నాగోలు: పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఆటోనగర్‌లోని హరిణవనస్థలి ఆవరణలో ఉన్న అనన్య ఎకోపార్క్‌లో 23 వ పద్మశాలి దసరా మేళా నిర్వహిస్తున్నట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం పున్న గణేష్‌నేత అధ్యక్షతన కొత్తపేటలో పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దసరా మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి, రాష్ట్ర పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్ మాట్లాడుతూ.. గత 22 సంవత్సరాలుగా పద్మశాలి సమాజ అభ్యున్నతికి కోసం మేళాను నిర్వహిస్తున్నామని ఈ మేళాలో పద్మశాలి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించుకోవడంతో పాటు ప్రముఖుల సంక్షిప్త సందేశాలు, చేనేత కళాకారులకు సన్మానాలు ఉంటాయన్నారు. 23వ దసరా మేళా చైర్మన్ కొకుంట్ల రవితేజ మాట్లాడుతూ.. ఈ మేళాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాకు చెందిన పద్మశాలి సంఘం అధ్యక్షులు, సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, శ్రావణ్, లక్ష్మీనారాయణ, సుదర్శన్, స్వప్న, రేఖా, రమాదేవి, సుజాత, భారతమ్మ, విశ్వేశ్వర్, తలాటి రమేష్, జిల్లా జగన్నాథం, పడాల రవీందర్, పాల్గొన్నారు.

ఓటరు జాబితాను బహిరంగ పర్చాలి

దిల్‌సుఖ్‌నగర్: ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఆదేశానుసారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లో సోమవారం పలు కాలనీలలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తొలగించిన అర్హుల ఓట్ల నమోదు, ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందే ఫొటోలతో కూడిన జాబితాను బహిరంగ పర్చాలన్నారు. ఓట్ చోరీపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ యుద్ధం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదులు, లింగస్వామిగౌడ్, ఎల్లన్న, రామకృష్ణ గౌడ్, రఘు, రాజు, రేణుక, సంతోష పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రమను ఆయుధంగా మార్చుకుంటే విజయం

దిల్‌సుఖ్‌నగర్: గ్రూప్–1 ఫలితాల్లో 30వ ర్యాంక్ సాధించి డీఎస్పీ గా ఎంపికైన బుసిరెడ్డి శాంతన్‌కుమార్ రెడ్డి సోమవారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహా రెడ్డి, నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బుసిరెడ్డి రవీందర్‌రెడ్డి కుమారుడు శాంతన్ డీఎస్పీగా ఎంపికగా కావడం సంతోషదాయకమన్నారు. యువత శ్రమను ఆయుధంగా మార్చుకుంటే విజయం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో సతీష్, సైదులు, లింగాస్వామి గౌడ్, రమేష్, ప్రభాకర్ ఉన్నారు.

రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి



అల్మాస్‌గూడలోని మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయని, అధికారులతో మాట్లాడి మరమ్మతులకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వెళ్లే ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ధ్వంసమై రోడ్లపై మురుగునీరు పొంగి పొర్లుతుండడంతో కాలనీవాసులతో ఆయన పరిశీలించారు. 24, 26 డివిజన్‌లలోని విశాఖనగర్–3, శ్రీసాయి హోమ్స్, వెంకటేశ్వరకాలనీ తదితర కాలనీల్లో డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం కమిషనర్ పి.సరస్వతితో మాట్లాడారు. కాలనీల్లో త్వరలో సమస్యలు పరిష్కారించేలా కృషి చూస్తామని హామీ ఇచ్చినట్లు మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గోలి రంజిత్‌రెడ్డి, కాలనీవాసులు రూపచారి, సందీప్‌రెడ్డి, చెవుల శ్రీను, రాజశేఖర్, గాంధీనాయక్, రాజు తదితరులు ఉన్నారు.

డ్రైనేజీని పూర్తిచేయించండి



బొడ్రాయికి పూజలు చేస్తున్న సబితారెడ్డి, గ్రామస్తులు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: సుల్తాన్‌పూర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ 13వ డివిజన్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బొడ్రాయికి స్థానికులతో కలిసి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులన్నీ త్వరలో పూర్తి చేయిస్తానని స్పష్టం చేశారు. డ్రైనేజీ సమస్యను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, కైసర్‌బామ్, శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మహ్మద్ అఖిల్, బొర్ర మాధవ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఎం పోటీ

మండల కార్యదర్శి శేఖర్



మాట్లాడుతున్న శేఖర్

మహేశ్వరం: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తుందని మండల కార్యదర్శి ఎర్రుల శేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నుంచి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేస్తామన్నారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో సీపీఎం ముందుంటుందన్నారు. ప్రజలు, కార్మికులు కమ్యూనిస్టుల వెంట నిలబడాలన్నారు. సీపీఎం బలపర్చిన అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సినియర్ నాయకులు అలువాల రవి కుమార్, ప్రకాష్, జగన్, జంగయ్య పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా

సైదాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా మక్కువ చూపాలని శ్రీత్రివేణీ ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గత నెల 25– 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాఠశాల విద్యార్థి ఎస్.చరణ్ ప్రతిభ కనబరిచాడు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చరణ్‌ను అభినందించారు.

ఎన్నికల్లో గెలవడానికే ఓట్ల చోరీ

- పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి
- మండల కేంద్రంలో సంతకాల సేకరణ



మహేశ్వరం: సంతకాలు సేకరిస్తున్న భాస్కర్‌రెడ్డి, నాయకులు

మహేశ్వరం: ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడి అక్రమంగా నెగ్గిందని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశానుసారం పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెద్దఎత్తున ఓట్ల చోరీకి పాల్పడి కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుబంధ సంస్థగా పనిచేస్తోందన్నారు. రాహుల్ గాంధీ ఓటు చోరీ జరిగిన తీరును వివరిస్తూ అన్ని రకాల ఆధారాలను చూపించినా కూడా ఈసీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం విడ్డూరమన్నారు. బీజేపీ చేస్తున్న అక్రమ ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. అంతకుముందు సంతకాల సేకరణ చేపట్టారు. ఓటు చోరీ జరిగిన తీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, నాయకులు నడికూడ శివ, నర్సింహ, నర్సింహాగౌడ్, వెంకటేశ్‌గౌడ్, కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికే వత్తాసు



కందుకూరులో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కందుకూరులో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాదె కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఓట్ల చోరీపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్ మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎన్నికల సమయంలో ఓట్లను చోరీ చేసి అధికారాన్ని చలాయిస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ మీడియా సమక్షంలో నిజ నిర్ధారణ చేసినా ఎన్నికల కమిషన్ స్పందించకుండా కేంద్ర ప్రభుత్వానికే వత్తాసు పలుకుతోందని విమర్శించారు. అర్హుల ఓట్లను తొలగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరికొండ మల్లేశ్, కె.రాణాప్రతాప్‌రెడ్డి, సయ్యద్ అజీజ్, సరికొండ జగన్, చిర్ర సాయిలు, మంద సాయిలు, ఎగ్గిడి జగదీష్, వినోద్‌చారి, బుక్క పాండురంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై ఉద్యమిస్తాం



బడంగ్‌పేట్: సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు చోరీపై ఐక్యంగా పోరాడుదామని మాజీ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లో ఓట్ల చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఓటు హక్కు ద్వారానే నిజమైన నాయకులను ఎన్నుకుంటారన్నారు. ఓటు హక్కును సరైన విధంగా ఉపయోగించకుండా ఓటర్ జాబితాలో తప్పులుగా, అక్రమాలకు పాల్పడి రాజ్యాంగాన్ని కూనీ చేస్తున్న బీజేపీపై ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలన్నారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ పోరాడుతున్న విధానానికి బీహార్ ఎన్నికల కమిషన్ పోలింగ్‌లో మార్పులు చేసిందన్నారు. ఈ మార్పు దేశమంతా అమలయ్యే వరకు శ్రమించాలన్నారు. వందకు తక్కువ కాకుండా ప్రతి డివిజన్ నుంచి సంతకాల సేకరణ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, ఏబీసీ కో–ఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాలునాయక్, సుభాన్‌యాదవ్, నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.